


రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.24 సోమవారం సాయంత్రం

సహారి: 4.42 మంగళవారం ఉదయం

31 వరకు గోదావరి డెల్టాకు నీటి విడుదల 7

వేస్ట్.. కాదు సుమా!





ఈ నెల 8న కాపవరంలో పరిశీలించిన మంత్రి నారాయణ

చెత్తతో విద్యుత్ వెలుగు

- చెత్త నుంచి విద్యుదుత్పత్తి
- రూ.370 కోట్లతో ప్లాంట్
- బిక్కవోలులో ఏర్పాటుకు ఓకే
- టెండర్లు పిలిచిన సర్కారు
- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణ
- 22 మునిసిపాలిటీల నుంచి చెత్త
- ఉభయగోదావరి జిల్లాలకు ఇక్కడే
- రోజుకు 950 టన్నులు
- 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- ప్రజల తీవ్ర అభ్యంతరం
- గ్రాసిం పరిశ్రమతోనే ఇబ్బందులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక మునిసిపాలిటీల్లో వందల టన్నుల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. నిత్యం వచ్చే వందల టన్నుల చెత్తను ఒక చోటకు చేర్చి దీని నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది..అటు జనానికి చెత్త సమస్య తీర్చడం..ఇటు కొండల్లా పోగయ్యే చెత్తను కనుమరుగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా విద్యుదుత్పత్తి చేసేలా రూ.370 కోట్లతో చెత్త నుంచి విద్యుత్ తయారీ యూనిట్ నెలకొల్పబోతోంది. కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌లో దీని ఏర్పాటుకు వీలుగా ప్రైవేటు సంస్థలను ఆహ్వానించింది. అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురంలో గ్రామాల్లో ప్రాజెక్టుకు స్థలాలు గుర్తించడంతో ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఇప్పటికే ఇక్కడ జనం గ్రాసిం కంపెనీ కాలుష్యంతో ఇబ్బంది పడుతుంటే చెత్తంతా ఇక్కడకు తేవడం సరికాదని స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి, అటు జనం వ్యతిరేకిస్తున్నారు. పెద్దాపురంలో స్థలం అనువుగా ఉన్నా ఎందుకు ఇక్కడే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 950 టన్నుల చెత్త..

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు 12 ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు నుంచి ఉత్పత్తి అవుతుంది. కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11,అమలాపురం మునిసిపాలిటీలో 30,కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో టన్నుల కొద్దీ చెత్త రోజువారీ వస్తోంది.ఈ చెత్తం టినీ ఒక చోట చేరిస్తే రోజుకు 12 మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చని అధికారులు తేల్చారు.

ప్లాంట్ ఖర్చంతా ప్రైవేటుదే..

12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ. 370 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరపున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వానికి ఏ మాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, 10 ముని సిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.ఈ ప్రాజెక్టు ఆరంభమైతే 22 కార్పొరేషన్లు, మునిసి పాలిటీల్లో చెత్త సమస్యకు చెక్ పడనుంది.ఈ ప్రాజెక్టుకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కాపవరంలో 12 ఎకరాలు,బలభద్రపురంలో 20 ఎకరాలను అధికారులు ఎంపిక చేశారు.12 ఎకరాల్లో విద్యుత్ ప్లాంట్, 20 ఎకరాల్లో చెత్తంతా వేసి విద్యుదుత్పత్తికి అనువుగా మార్చడం చేయనున్నారు.ఈ నెల 8న మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

ప్రాజెక్టుపై వ్యతిరేకత..

ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి తెచ్చిన చెత్తంతా వేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఊరు చుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం ఇబ్బందులు పడతారని అంటున్నారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరక యాతన పడుతున్న జనానికి ఇది మరో ముప్పు అని ధ్వజమెత్తుతున్నారు. అటు చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయవద్దంటూ కాపవరం, బలభద్రపురం పంచాయతీలు సైతం ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ ప్రాజెక్టుకు అనువైన భూమి పెద్దాపురంలో గుర్తించిన అధికారులు మళ్లీ బిక్కవోలు వైపు చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాపవరం,బలభద్రపురానికి సమీపంలో చెత్త నుంచి తయారయ్యే విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించుకునేలా విద్యుత్‌లైన్ ఉండడం వల్ల మొగ్గుచూపుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

27న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

- 35 పంచాయతీల్లో ఖాళీలు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- పల్లెల్లో ఎన్నికల సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తికావడంతో పలు చోట్ల అభ్యర్థుల మార్పులు అవిశ్వాస తీర్మానాలు ఆరంభంకానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్లలో మొత్తం 35 పంచాయతీల్లో ఖాళీ అయిన ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని వార్డు సభ్యులకు నోటీసులు ఇచ్చారు. 27న ఈవోపీఆర్‌డీ ఎన్నికల అధికారిగా ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.కూటమి అధికారంలోకి ఉండడంతో ఉపసర్పంచ్ పదవులు కైవశంచేసుకోవాలనే వ్యూహంతో వ్యవహరిస్తోంది.

- తూర్పుగోదావరి జిల్లాలో 12 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.గోకవరం మండలం మల్లవరం, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు,గోపాలపురం,వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం,రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ,సీతానగరం మండలం మునికూడలి,ఉండ్రాజవరం గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలంలో జి.మూలపొలం,ముమ్మిడివరం మండలం సిహెచ్.గున్నేపల్లి, రాజోలు మండలం సోంపల్లి, శివకోటి, ఆలమూరు మండలం మొదుకూరు, కొత్తపేట మండలం కొత్తపేట, పలివెల, మలికిపురం మండలం లక్కవరం,చింతలమోరి, సఖినేటిపల్లి మండలంలో మోరిపొడు, అంతర్వేదిపాలెం, అంబాజీపేట మండలంలో మాచవరం, అల్లవరం మండలంలో ఎంట్రికోన, అయినవిల్లి మండలంలో బోతుకుర్రు, రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.
- కాకినాడ జిల్లాలో పెదపాడు మండలం రామేశ్వరం,తుని పరిధిలో దొండవాక,సామర్లకోట మండలం బి.వేమవరం, తొండంగి మండలం పైడికొండ,ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి పంచాయతీల పరిధిలో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

జనసేన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

- డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటన 7

ముంబై ఇండియన్స్‌లో... మనోడు మెరిశాడు!

- ఐపీఎల్‌లో ఆడిన కాకినాడకు చెందిన సత్యనారాయణరాజు 7

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి 7

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్

క్షయ వ్యాధి నివారణ..

అందరి బాధ్యత



- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో మందులు.. ఉచిత చికిత్స
- జిల్లాలో 23 కేంద్రాల్లో ట్రునాట్ యంత్రం ద్వారా వ్యాధి నిర్ధారణ
- జిల్లాలో గతేడాది 1398 టీబీ కేసులు
- నేడు ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం

పి.గన్నవరం, మార్చి 23: భారతదేశంలో అంటువ్యాధుల్లో క్షయవ్యాధి ఒకటి.. గతంలో ఈ వ్యాధి బారినపడి అనేకమంది మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. కాలక్రమేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధిపై ప్రత్యేక దృష్టి కనబర్చడంతో క్షయ వ్యాధి సోకిన వారి సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. నాణ్యమైన మందులు అందించడంతో వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకుంటున్నారు. నూతనంగా ఆరునెలల బీపీఏఎల్ఎం చికిత్స ప్రవేశపెట్టి ప్రత్యేక రోగులకు ఖరీదైన మందులను అందించేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు

ఇది ఒక అంటువ్యాధి. వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడులేదా తుమ్మినప్పుడు సూక్ష్మక్రిములు తుంపర్లద్వారా గాలిలోకలిసి వ్యాధిని ఆరోగ్యవంతులకు వ్యాపింపచేస్తుంది. ఎక్కువగా ఊపిరితిత్తులకు సోకుతుంది. దీన్నే శ్వాసకోసక్షయ అంటారు. రెండు వారాలకు మించిన దగ్గు, రాత్రిపూట జ్వరం రావడం, ఆకలి తగ్గడం, ఛాతిలో నొప్పి,బరువు తగ్గడం, ఉమ్మిలో రక్తం వంటివి లక్షణాలు.

పై లక్షణాలు కలిగినవారు వ్యాధి నిర్ధారణ కోసం రెండుసార్లు కఫం(తెమడ) పరీక్షలు చేయిండం ద్వారా, పోరోసెంట్ మైక్రోస్కోపీ, సీబీఎన్ఏఏటీ, ఆర్‌టీసీఆర్(నూతన విధానం) ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు. అనుమానితులు దగ్గర్లో ఉన్న ఉప కేంద్రంలో లేదా ప్రభుత్వాస్పత్రుల్లో సంప్రదించాలి. అత్యంత ఖరీదైన ఎల్‌పీఏ వంటి పరీక్షలు కేంద్రప్రభుత్వం ఉచితంగానే చేస్తోంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బిడ్డ పుట్టిన వెంటనే బి.సి.జి సూది మందు ఇప్పించాలి. దగ్గు వచ్చినప్పుడు గుడ్డ నోటికి అడ్డుపెట్టుకోవాలి, క్షయ రోగి ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయరాదు. క్రమం తప్పకుండా మందులు వాడాలి. పెక్టివ్ కేస్ ఫైండింగ్ అనే కొత్తవిధానం ద్వారా రోగి కుటుంబీకులకు కూడా పరీక్షలు నిర్వహించి రోగులను గుర్తిస్తారు.

జిల్లాలో ఏడు చికిత్సా సెంటర్లు

జిల్లాలోని క్షయ వ్యాధిని నివారించేందుకు పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, మండపేట, కొత్తపేటల్లో చికిత్సా సెంటర్‌లు ఏర్పాటు చేశారు. జిల్లాలోని అత్యాధునిక టీబీ నిర్ధారణ యంత్రం(ట్రునాట్) ద్వారా సేవలందించేందుకు అమలాపురం ఏరియా ఆస్పత్రితో పాటు జిల్లాలోని 22 మండలాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక సిబినాట్ యంత్రం ద్వారా, 41 క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో కళ్లె(తెమడ) పరీక్షలు జరుగుతున్నాయి.



అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గతేడాది కేసులివి..

జిల్లాలో గతేడాది మైక్రోస్కోపీ పరీక్షలు 35,574, ట్రూనాట్ పరీక్షలు 25,471, సీబీనాట్ పరీక్షలు 2,516 వెరసి 63,561మందికి పరీక్షలు నిర్వహించగా 1398 కేసులు నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు. ఈజనవరి,ఫిబ్రవరిల్లో.. పరిశీలిస్తే.. మైక్రోస్కోపీ పరీక్షలు 6,537, ట్రూనాట్ 2019, సీబినాట్ 668 వెరసి 9224మందికి పరీక్షలు నిర్వహించగా 223కేసులు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా 385 పంచాయతీలకుగాను 124 ముక్త్ పంచాయితీలుగా గుర్తించారు.

మందులతో నయం

క్షయ మందులతో నయమవుతుంది. ప్రత్యక్ష పర్యవేక్షణ స్వల్పకాలిక చికిత్స(డీవోటీఎస్)ద్వారా మందులు వాడాలి. కొత్తగా గుర్తించిన రోగులు ఆరునెలలపాటు మందులు వాడాలి. క్రమం తప్పితే మళ్లీ వాడాల్సిందే. కొత్తగా ప్రవేశపెట్టిన రోజువారీ(ఎఫ్‌డీసీ) చికిత్సా విధానం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని వైద్యులు చెప్తున్నారు.

వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.1000

జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ద్వారా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం నిమిత్తం నేరుగా వ్యక్తిగత ఖాతాల్లోకి రూ.1000 అందజేస్తారు. నోటిపై చేసిన ప్లబిక్, ప్రైవేటు ఆస్పత్రుల్లో మందులు వాడుతున్న రోగులకు ప్రధానమంత్రి టి.బి ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా ని-క్షయ్ పోషణ యోజన ద్వారా ఈ సహాయం అందిస్తోంది.

శరవేగంగా..



- అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ
- జిల్లాకు చేరుకున్న 1,48,195 జవాబు పత్రాలు
- రిపోర్టు చేసిన 435మంది అధ్యాపకులు
- ఏప్రిల్ 4 నాటికి పూర్తి

అమలాపురం టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రారంభమైంది. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియకు ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ నెల 7 నుంచి నామమాత్రంగా జవాబుపత్రాల మూల్యాంకన ప్రారంభమైంది. 17నుంచి ఆ ప్రక్రియను వేగవంతం చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. అందుకు తగినట్టుగా అధ్యాపకులు మూల్యాంకన ప్రక్రియకు హాజరవుతున్నారు.

జిల్లాకు 1,48,195 జవాబు పత్రాలు

వివిధ జిల్లాలకు చెందిన ఇంటర్మీడియట్ జవాబు పత్రాలు 1,48,195 కోనసీమ జిల్లాకు వచ్చినట్టు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈనెల 7 నాటికి సంస్కృతం పేపర్లు జిల్లాకు చేరుకోగా అప్పుడే మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించారు. 17 నాటికి పూర్తి స్థాయిలో పేపర్లు చేరుకోవడంతో ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 17నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లీషు, పౌరశాస్త్రం, గణితం, జవాబు పత్రాల మూల్యాంకన ప్రారంభమైంది. ఇప్పటికే హిందీ పేపర్ల మూల్యాంకన పూర్తయింది. 22 నుంచి భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం జవాబుపత్రాలను మూల్యాంకన చేస్తున్నారు. 24నుంచి రసాయనశాస్త్రం, చరిత్ర, 26నుంచి వాణిజ్యశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఇప్పటివరకు 43,616 జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారు.మరికొన్ని జవాబుపత్రాలు ఈ కేంద్రానికి చేరుకునే అవకాశం ఉంది.

మూల్యాంకనకు అధ్యాపకులు

ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనంలో 435మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరిలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు 300మంది, చీఫ్ ఎగ్జామినర్లు 63మంది, స్క్రూటినైజర్లు 63మంది, ఏసీవో, వాల్యుయేషన్ సిబ్బంది 9మంది ఉన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఒక్కొక్క ఎగ్జామినర్‌కు 30 పేపర్లు మూల్యాంకనం చేసేందుకు అందిస్తున్నారు. ఒక చీఫ్ ఎగ్జామినర్‌వద్ద ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ఒక స్క్రూటినైజర్‌ను నియమించారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి సూచనల ప్రకారం ఏప్రిల్ 4 నాటికి ఇంటర్ మూల్యాంకనం పూర్తి చేయాల్సి ఉంది.

జాప్యం నివారణకు స్కానింగ్ ప్రక్రియ

స్పాట్ వాల్యుయేషన్‌లో భాగంగా జవాబు పత్రాల మూల్యాంకనంతోపాటుగా మార్కుల టేబులేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. గతంలో అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేసిన పత్రాలను చీఫ్ ఎగ్జామినర్ పరిశీలించి వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు పంపించేవారు. అక్కడ కోడ్ ప్రకారం విద్యార్థులకు మార్కులు కేటాయించి అంతిమంగా ఫలితాలను విడుదల చేసేవారు. ఈ విధానంలో కొంత జాప్యం జరుగుతుండడాన్ని గుర్తించారు. స్పాట్ వాల్యుయేషన్‌లోనే జవాబు పత్రాల మూల్యాంకనం తర్వాత మార్కుల టేబులేషన్(స్కానింగ్) ప్రక్రియ నిర్వహిస్తున్నారు. సదురు విద్యార్థికి వచ్చిన మార్కులను స్కానింగ్ చేసి ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. దీనివల్ల ఫలితాలు సత్వరం విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. మూల్యాంకనం పూర్తయిన జవాబుపత్రాలు సంబంధిత కళాశాలలోనే ఉంటాయి.

అధ్యాపకులను స్పాట్ విధులకు పంపించాలి

-వి.సోమశేఖరరావు, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి



స్పాట్ వాల్యుయేషన్ విధులకు నియమించిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్స్ రిలీవ్‌చేసి కేంద్రానికి పంపించాలి. ఇప్పటికే స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభమైంది. మార్కుల స్కానింగ్ విధానం కొనసాగిస్తున్నాం. జిల్లాలోని జవాబు పత్రాలను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు పంపించారు. ఇతర జిల్లాల జవాబు పత్రాలు ఇక్కడకు చేరాయి. జిల్లా కేంద్రంలో ఉంచిన జవాబు పత్రాలకు సంబంధించి ఎవరైనా విద్యార్థులకు మార్కులు తక్కువ వచ్చాయని రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత జవాబు పత్రాన్ని బయటకు తీసి తిరిగి వాల్యూ చేస్తారు. ఏప్రిల్ 4 నాటికి మూల్యాంకనం పూర్తికి చర్యలు తీసుకున్నాం.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటలనుంచి యథావిధిగా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డివిజన్‌స్థాయిలో ఆర్డీవో కార్యాలయాలవద్ద, అన్ని మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో గ్రీవెన్స్ జరుగుతుందని తెలిపారు. మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌ను అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళ్లెదుటే చేలు బీటలు

- సాగునీరందక ఎండుతున్న వరిచేలు
- కన్నీటి పర్యంతమవుతున్న రైతులు

అల్లవరం మార్చి 23(ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక తమ కళ్ల ఎదుటే కష్టపడి ఊడ్చి కాపాడుకున్న వరిచేలు బీటలు తీయడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పంట కాల్వల ద్వారా సక్రమంగా సాగునీరు అందించడంలో ఇరిగేషన్‌శాఖ పూర్తి వైఫల్యం చెందిందని వారు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సక్రమంగా వంతులు పాటించనందునే కాల్వల్లో నీరు లేక చేలకు నీరు సరఫరా కాక చేలు ఎండి తమ పంటలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అల్లవరం మండలం గూడాల, తాడికోన పరిసర గ్రామాల్లో దాళ్వా చేల పరిస్థితి సాగునీరు లేక దయనీయంగా మారింది. దాళ్వా వరిచేలు ఈనిక దశలో ఉండగా సాగునీరు లేకుంటే పంట నష్టాలు తీవ్రతరమై రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. తాడికోన, గూడాల ప్రాంతాల్లో సక్రమంగా సాగునీరు సరఫరా లేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని నీటి సంఘ అధ్యక్షుడు సాధనాల నాగబాబు, ఉపాధ్యక్షుడు పంపిరెడ్డి కాశీ ఆరోపించారు. మరో రెండురోజుల్లో కాల్వల ద్వారా సక్రమంగా సాగునీరు ఇవ్వకుంటే తాము ఉద్యమం చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల వైఫల్యంపై ప్రజాప్రతినిధులు కలెక్టర్ స్పందించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



అల్లవరం మండలం గూడాలలో సాగునీరు లేక బీటలు తీసిన దాళ్వా వరిచేలు

శెట్టిబలిజ జాతిపిత వెంకటరెడ్డి సేవలు..

చిరస్మరణీయం: మంత్రి సుభాష్

అల్లవరం మార్చి 23(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ జాతిపిత, శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అల్లవరం హైస్కూల్ సెంటర్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన నిలువెత్తు శిలా విగ్రహానికి పూలమాల వేసి మంత్రి సుభాష్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలోఎంపీపీ యిళ్ల శేషగిరిరావు,దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, బొక్కా శ్రీను, పితాని శేఖర్, చెల్లుబోయిన రమేష్, చొల్లంగి వెంకటరమణ, దొమ్మేటి రామకృష్ణ, రాయుడు విష్ణుమూర్తులు, కడలి గంగాచలం, పాటిశ్రీరామ్, భైరిశెట్టిరామారావు, శెట్టిబలిజ వర్గీయులు పాల్గొన్నారు.



అల్లవరంలో వెంకటరెడ్డి విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

దొంగలు దొరికారు!

● బైక్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన రాజమహేంద్రవరం పోలీసులు

● రూ.16 లక్షలు విలువ చేసే 31 ద్విచక్ర వాహనాల స్వాధీనం



రాజమహేంద్రవరంలో 31 బైక్‌లు, దొంగలతో డీఎస్పీ రమేష్ బాబు, సీఐ బాజీలాల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు బైక్ దొంగలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు మాట్లాడారు. ప్రకాష్‌నగర్ సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, క్రైమ్ కానిస్టేబుల్స్ కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబు, వి.శివ ప్రసాద్‌లు.. బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నల్లజర్ల మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన తూర్ల సోమయ్యను, అతడు దొంగిలించిన బైక్‌లను కొనుగోలు చేస్తున్న నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన చీర్ల కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సోమయ్య 3 నెలలుగా రాజమహేంద్రవరంలోని మంగళవారపుపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని చుట్టుపక్కల తిరుగుతూ బైక్ దొంగతనాలు చేస్తున్నాడు. అతడు ప్రకాష్‌నగర్ పరిధిలో 9, త్రీటౌన్ పరిధిలో 9, వన్‌టౌన్ పరిధిలో 3, నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2, కోరుకొండ స్టేషన్‌పరిధిలో 1, ఏలూరు స్టేషన్ పరిధిలో 3, విజయవాడలో 1 బైక్‌ను దొంగించాడు. అతడిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైక్ దొంగతనం చేస్తుండగా అరెస్టు చేసి విచారించగా అతడి వద్ద రూ.16లక్షలు విలువ చేసే 31 బైక్‌లు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, క్రైమ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

తిమ్మాపురంలో బైక్ దొంగ అరెస్ట్

18 బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలబారిన పడిన నిందితుడు కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బైకల చోరీ బాట పట్టి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ వివరించారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం బొండపల్లి ఏసుకుమార్ అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెడు వ్యవసనాలకు అలవాటుపడి బైక్‌ల చోరీల బాటపట్టాడు. ఇంటి ఆవరణ, పబ్లిక్ స్థలాలు, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్ లాక్‌లను ఎంతో చాకచక్యంగా మారుతాళాలతో తొలగించి బైక్‌లను ఎత్తుకుపోయి అమ్మేస్తున్నాడు. బైక్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ నేతృత్వంలో రూర ల్ సర్కిల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం పోలీసులు, క్రైం పార్టీ సిబ్బంది నిందితుడి కోసం దర్యాప్తు చేస్తున్నారు. అయితే ముందస్తు సమాచారం మేరకు తిమ్మాపురం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తోండగా తిమ్మాపురం వై జంక్షన్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 18 బైక్‌ల దొంగతనం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని సీఐ చైతన్యకృష్ణ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి 18 బైక్‌లతో పాటూ, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దివాన్‌చెరువులో చోరీ చేసిన 2బంగారు ఉంగరాలు, ఓ చైన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు చిన్నతనంలో తల్లి మరణించడంతో తండ్రి పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చెడు వ్యసనాల బాట పట్టాడన్నారు. నిందితుడిపై పెద్దాపురం, భీమవరం టూటౌన్‌లో -2, కాకినాడ పోర్టు, తుని టౌన్‌లో -2, కాకినాడ టూటౌన్ క్రైం పీఎస్‌లో 3, అమలాపురం టౌన్ పీఎస్‌లలో 10 కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్న అధికారులు, సిబ్బందిని ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ అభినందించారు. సమావేశంలో తిమ్మాపురం స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఉన్నారు.



నిందితుడు, 18 బైక్‌లతో సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత

ముంబై ఇండియన్స్‌లో...
మనోడు మెరిశాడు!

ఐపీఎల్‌లో ఆడిన కాకినాడకు చెందిన సత్యనారాయణ రాజు



సత్యనారాయణ రాజు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడకు చెందిన ఫాస్ట్ బౌలర్ పెన్మత్స సత్యనారాయణ రాజుకు ఐపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. ముంబై ఇండియన్స్ జట్టులో బౌలర్‌గా చోటు దక్కించుకున్నాడు. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సత్యనారాయణ ఆడడంతో ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలోని వారి ఇంటిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. ఫాస్ట్ బౌలర్ అయిన సత్యనారాయణ రాజు దేశవాళీ లీగ్లో సత్తా చాటాడు. రంజీ పోటీల్లో ఎనిమిది మ్యాచ్‌లలో 17 వికెట్లు తీసి అందరి దృష్టి ఆకర్షించాడు. ఈ నేపథ్యంలోనే అతడు ముంబై ఇండియన్స్ జట్టుకు ఎంపికైనట్టు ఆయన తండ్రి రమేష్ తెలిపారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వంటి పెద్ద జట్టులో చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందని వెల్లడించారు.



టీవీలో ఐపీఎల్‌ను తిలకిస్తున్న సత్యనారాయణ రాజు కుటుంబసభ్యులు, స్నేహితులు

రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని సర్జరీ విభాగంలో ఆదివారం రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు జరిగింది. సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాపుకు ముఖ్యఅతిథిగా డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. ఇలాంటి వర్క్‌షాపులు మరిన్ని జరగాలని తద్వారా వైద్య విద్యార్థులకు శస్త్రచికిత్సా విధానాలపై మరింత పట్టు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. కాకినాడతో సహా రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం వైద్య కళాశాలలకు చెందిన పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. సర్జరీ వైద్య నిపుణులు రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులకు బోధించారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ ప్రశోబ్, డాక్టర్ నరేంద్ర బోధకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్, ఆర్థోపెడిక్ హెచ్‌వోడి డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ కె.బాబ్జి, డాక్టర్ పి.వెంకటబుద్దా, డాక్టర్ రవికమల్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శైలజారాణి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ మైథిలిదేవి, డాక్టర్ శైలజా హాజరయ్యారు.

సామర్లకోటలో ఉత్సాహంగా...

రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సీనియర్స్‌లో విజేతగా గుమ్మిలేరు, జూనియర్స్‌లో సామర్లకోట ఎడ్లు



పోటీలో పరిగెడుతున్న ఎడ్లు

సామర్లకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు ఎస్ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ రోడ్డులో ఉత్సాహంగా నిర్వహించారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్‌గా ఈ పోటీలను నిర్వహించగా మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. 4 కిలోమీటర్లు వెళ్లి వచ్చేందుకు నిర్వహించిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో అనకాపల్లి అర్జనగిరికి చెందిన పరవన్నాయుడి ఎడ్లు, తృతీయ స్థానంలో గుమ్మిలేరుకు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. సీనియర్స్ విభాగంలో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి.



సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని శృతిచౌదరికి అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

జూనియర్స్ విభాగంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వడిశలేరు సిద్దివినాయక శ్రీనివాసుకు చెందిన ఎడ్లు, తృతీయ స్థానంలో గాడాల మద్దాల శ్రీనుకు చెందిన ఎడ్లు, నాల్గోస్థానంలో వెల్దుర్తి మొగలి ఏసుబాబుకు చెందిన ఎడ్లు, ఐదోస్థానంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. జూనియర్స్ విభాగంలో మొత్తం 25 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులు కంటే జగదీష్‌మోహన్, వల్లూరి దొరబాబు తదితర కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా ఎమ్మెల్యేను సత్కరించారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్



మాట్లాడుతున్న వెంగళరావుయాదవ్

అమలాపురం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచిన వెనుకబడిన వర్గాలు అంతకంతకు వెనుకబడిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంకగళరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల బీసీ ప్రతినిధులతో ఢిల్లీని దిగ్బంధనం చేస్తామని ప్రధాని మోదీకి బీసీల సత్తా చూపిస్తామన్నారు. సమాజంలో బీసీలపై దాడులు, అవమానాలు పెరిగిపోతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణచట్టం అమలు చేయాలన్నారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

కార్యవర్గ సభ్యులుగా నియామకం

జిల్లా నుంచి జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మట్ట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా కైల శోభన్‌బాబు, కందుల విజయ్‌కుమర్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడిగా రాయుడు సత్యరుషి, అధ్యక్షునిగా కాటాడి ఉమామహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరశిఖ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులుగా పావులూరి శివరామకృష్ణ, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, కోశాధికారి, అధికార ప్రతినిధిగా కానుబోయిన దుర్గాప్రసాద్, యువజన సంఘ అధ్యక్షునిగా మందపాటి బాలు, కార్యదర్శులుగా కముజు శ్రీనివాసరావు, టేకి వెంకటరమణలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి వెంగళరావుయాదవ్ అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమోహన్‌ముదిరాజ్, గొనుగుంట్ల యల్లమందరావు, కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

పరారైన ఖైదీని పట్టుకున్న పోలీసులు



ఖైదీతో యానాం పోలీసులు

యానాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారైన కొద్దిగంటల్లోనే యానాం పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 25అడుగు ఎత్తున్న సబ్ జైల్ ప్రహరీ దూకి నిందితుడు కే.వెంకటేశ్వరరావు పరారైన విషయం తెలిసిందే. శనివారం రాత్రి పోలీసులు కాకినాడ రైల్వే స్టేషన్‌లో ఖైదీని పట్టుకున్నారు. క్రైం సిబ్బంది పబ్బినీడి ఏసుబాబు, మల్లాడి గణేష్, దేవరపల్లి సురేష్‌లను సీఐ షణ్ముగం, మాజీ సీఐ గూటం శివగణేష్ అభినందించి సత్కరించారు.

నాలుగు రోజుల్లో కొత్తపేటకు వస్తా

పరారైన సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న హేమంత్

కొత్తపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు పరారై సుమారు 45 రోజులు గడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆదివారం హేమంత్ ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేసి పలు విషయాలను చెప్పాడు. తాను ప్రాణభయంతో పారిపోయానని, 4రోజుల్లో కొత్తపేటకు వస్తానని తెలపాడు. అయితే తమ వ్యాపార సంస్థలో తాకట్టు పెట్టిన ఏ బంగారు వస్తువులను కరిగించలేదని కూడా తీసుకుని వెళ్లలేదని చెప్పాడు. తాను నమ్మి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారితో కొన్ని లావాదేవీలు జరపడం అతడు సమాధానం చెప్పకపోవడంతో తాను పరారీ కావాల్సి వచ్చిందన్నాడు. తమ తాకట్టు వ్యాపారంలో కుదువపెట్టిన ఖాతాదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పద్దు వివరాలు తన వద్ద ఉన్నా యన్నాడు. ఖాతాదారులు పెట్టిన బంగారు వస్తువుల సైతం కొన్ని తన వద్ద, మిగిలినవి తన పార్ట్నర్స్ వద్ద భద్రంగా ఉన్నాయని తాను వచ్చిన తరువాత పోలీసుల సమక్షంలో అన్ని వెల్లడిస్తానని హేమంత్ వీడియోలో పేర్కొన్నాడు.

విద్యారంగంలోని
ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ పోరుబాట విద్యాసదస్సులో రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్



పోరుబాట సదస్సులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హాజరైన ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో పోరుబాట పేరుతో ప్రాంతీయ విద్యాసదస్సు జరిగింది. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా బకాయిల చెల్లింపుపై శ్రద్ధ చూపడంలేదన్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలని, 29శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాస్టార్లు మార్కిస్టు, కమ్యూనిస్టు భావాలతో ఉన్నపుడే నూతన మానవులను, నూతన సమాజాన్ని తయారు చేయగలరన్నారు. టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 117 రద్దు, పాఠశాలల కుదింపు, పాఠశాలల్లో రెండు మీడియంలు కొనసాగింపు వంటి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు అనివార్యమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, తోటకూర చక్రవర్తి, కె.శ్రీదేవి, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, అల్లూరి మన్యం జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, కేవీవీ నాగేశ్వరరావు, విజయరామరాజు, రామభద్రం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు
గోదావరి డెల్టాకు నీటి విడుదల

డొంకరాయి జలాశయం ద్వారా 4 వేల నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల

మోతుగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీటి విడుదలను మార్చి 31 వరకు కొనసాగిస్తామని జెన్‌కో వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం విడుదల చేస్తున్న 4వేల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచామని పేర్కొన్నాయి. ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో ఇరిగేషన్ అధికారుల అభ్యర్థన మేరకు అదనపు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే మరో 4300క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామని ఆ వర్గాలు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నుంచి మార్చి 21వ తేదీ వరకు నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు తొలుత కోరారు. అయితే రబీ పంటలకు నీటి వినియోగం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు మార్చి 31 వరకు కొనసాగించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు కలిసి 9,300 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు డొంకరాయి స్పిల్‌వే గేట్లు నుంచి విద్యుదుత్పత్తి చేయకుండా గోదావరి డెల్టాకు 10.19 టీఎంసీలు నీటిని విడుదల చేశామని ఆ వర్గాలు తెలిపాయి. బలిమెల జలాశయంలో ఆంధ్రావాటాగా 36.7088 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 13.5906టీఎంసీలు కలిసి 50.2994 టీఎంసీలనీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ ఏడాది వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి కొరత లేదని జెన్‌కో అధికారులు తెలిపారు.

జేఎన్టీయూకేను రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి

వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్



ప్రభాకరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ

జేఎన్టీయూకే, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047, వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 మాదిరిగా వికసిత్ జేఎన్టీయూకే-2047కు అనుగుణంగా రోడ్ మ్యాప్ తయారుచేసి జేఎన్టీయూకేను దేశంలోని విద్యాసంస్థలకు రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేయనున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సౌధా-2కె25 పేరుతో 2 రోజుల పాటు ఓఎస్డీ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే.ప్రసాద్, విశిష్ట అతిథిగా పూర్వ విద్యార్థి, విశ్రాంత కల్నల్ ఎంఎస్.ప్రభాకరరావు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలు, నూతన ఆలోచనలకు ఇటువంటివి మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ప్రభాకరరావు మాట్లాడుతూ వర్శిటీ నుంచి ఎంతోమంది పూర్వ విద్యార్థులు త్రివిధ దళాల్లో చేరి దేశానికి సేవచేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా దేశానికి సేవచేసేందుకు త్రివిధ దళాల్లో చేరాలని సూచించారు. సింపోజియంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీతః శ్రీనివాసులు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, జేవీఆర్ మూర్తి, రామ్‌ప్రసాద్, రాజ్‌కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ శివారులో నిర్వహించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభ జయకేతనం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సభ దిగ్విజయం చేసేందుకు కృషి చేసిన అందరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. సభా ప్రాంగణాన్ని వేడుకకు అనువుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన నియోజకవర్గ నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, కరణం సూరిబాబులకు, జయకేతనం విజయవంతం చేసేందుకు సభా ప్రాంగణం వద్ద కృషి చేసిన నాయకులు బొజ్జా రాంప్రసాద్, తలారి శ్రీనివాస్, మొగ లి రాజా, పోలం రాజేష్, కంచర్ల భవానీశంకర్, పులపా రాజేష్, మేళం రామకృష్ణ, పిండి శ్రీను, గరగ అయ్యప్ప, చక్కపల్లి వినయ్, పబ్బినీడి ప్రసాద్‌కు, సభా వద్ద పనిచేసిన వలంటీర్లు, వీరమహిళలు, జనసైనికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నిర్మలగిరిలో ప్రత్యేక ప్రార్థనలు

మేరీమాత మహోత్సవాలకు తరలిన భక్తులు



నిర్మలగిరి మెట్ల మార్గంలో కొండపైకి వెళ్తున్న భక్తులు

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర మేరీమాత మహోత్సవాల్లో ఆదివారం మేరీ మాత మందిరం వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం పవిత్ర దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో దివ్య బలిపూజ, పరిశుద్ధ జపమాల, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక నాటికలు, నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడ ంతో ఇటు దేవరపల్లి నుంచి అటు పంగిడి నుంచి వాహనాలను పోలీసులు మళ్లించారు.



మేరీమాత మందిరం వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సత్యదేవుని భూములను పరిశీలించిన అటవీశాఖ కన్జర్వేటర్

అన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములను ఆదివారం అటవీశాఖ కన్జర్వేటర్ శివరామ్, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం లీజుల విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చెందుర్తి, గొంది గ్రామాల్లో ఉన్న భూముల్లో ఏ విధమైన పంట పండించాలి, దీని అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై త్వరలో నివేదికను ఇస్తామని దానిని అనుసరించాలని తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నవరం ఉద్యానవనాల్లో పెంచుతున్న మారేడు వనాలపై మాట్లాడుతూ చెట్టు ఆకులను మాత్రమే కోయాలని తెంపడం, నరకడం చేయకూడదని అలా చేయడం వల్ల వనం పెరగదన్నారు. ఎప్పటికప్పుడు డ్రిప్ ద్వారా నీరు మొక్కలకు చేరేలా చూడాలన్నారు. కళాశాలను ఆనుకుని ఉన్న ఉద్యానవనం, కొండపై వేదపాఠశాల, నక్షత్రవనంలో మొక్కలు పెంచేవిధానం బాగుందని ప్రశంసించారు.



గొందిలో దేవస్థానం భూములను పరిశీలిస్తున్న అధికారులు

భక్తులతో కిక్కిరిసిన ‘లోవ క్షేత్రం’

తుని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని లోవ క్షేత్రం తలుపులమ్మ నామస్మరణతో మారుమోగింది. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.10 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, మార్చి23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం స్వామివారి సుదర్శన హోమానికి పాలకొల్లుకు చెందిన నూలి భాస్కర్, కుటుంబ సభ్యులు ఆది వారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తొండవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమలాపురం రోహిణి ఆసుపత్రి వైద్యులు వీఎస్ఎస్ఎస్ మూర్తి, ఆదర్శ ఆసుపత్రి వైద్యులు దీక్షితుల శ్రీనివాసు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

విహారయాత్రలతో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం

• సైన్స్ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం

ముమ్మిడివరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక చారిత్రక విజ్ఞాన ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు విజ్ఞాన విహార యాత్రలు ఎంతో దోహదనిస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. విద్యార్థుల విద్య, విజ్ఞాన యాత్రలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 6 నుంచి 9 తరగతుల వరకు గల విద్యార్థులు సైన్స్ ఈవెంట్‌లో పాల్గొన్న 116మంది విద్యార్థులను ఎంపికచేసి 20 మంది ఉపాధ్యాయులతో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబులతో కూడిన బృందం విద్యా విజ్ఞాన విహారయాత్రలు చేపట్టింది. దీనిలోభాగంగా ఈనెల22వ తేదీన తిరుపతిలోని ప్రముఖ శాస్త్ర, సాంకేతిక, చారిత్రక


తిరుపతి సాంకేతిక విజ్ఞాన సంస్థలో విద్యార్థులు

ప్రదేశాలను సందర్శించింది. తొలుత తిరుపతిలోని ఐఐటీ క్యాంపస్‌ను పరిశీలించి అక్కడ విద్యా విధానాన్ని విద్యార్థులు ఆకలింపు చేసుకున్నారు. ఐఐటీ విద్యార్థుల్లో ఇంటరాక్షనయ్యారు. ప్రొఫెసర్ మహేష్‌కుమార్ విద్యా వ్యవస్థలో సాంకేతికత, ప్రాముఖ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరా జులాజికల్ పార్కును సందర్శించి బెంగాల్ టైగర్, తెల్లపులి, నెమలి జాతులు, దుప్పులు, జింకలు, ఇతర పక్షి జాతులను పరిశీలించి, వివిధ జీవజాతుల స్వభావం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిని గురించి తెలుసుకున్నారు. తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించి నిత్య జీవిత సమస్యలకు శాస్త్రం, సాంకేతికత ఎంత ఉపయోగపడుతుందో అవగాహన చేసుకున్నారు. ప్లానిటోరియం షో స్పేస్ ఎక్స్‌పోజింగ్ షోను పరిశీలించారు. అనంతరం రీజనల్ సైన్స్ సెంటర్‌లోని రొటేటింగ్ చైర్ ప్రత్యేకతను తెలుసుకున్నారు. రీజనల్ సైన్స్ సెంటర్‌లో అతిపెద్ద టెలీస్కోప్‌ను వీక్షించారు. దాని ద్వారా తిరుపతి శిఖరాలను అక్కడి నుంచి అత్యంత నాణ్యతతో వీక్షించగలిగారు. అనంతరం చంద్రగిరికోటను సందర్శించి చారిత్రక విశేషాలను తెలుసుకున్నారు. ఈవిజ్ఞాన విహార యాత్రలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, కోఆర్డినేషన్ ఇన్‌చార్జి పెచ్చెట్టి శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారులు, విద్యార్థులు ఉన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు ఆచరణీయం

• ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు
• వెంకటరెడ్డి జయంతి వేడుకలు



ముమ్మిడివరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, అమలాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ

ముమ్మిడివరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భూదాన, విద్యాదానం వంటి సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చిరస్మరణీయంగా నిలిచిన స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు అందరికీ ఆచరణీయమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పేర్కొన్నారు. శెట్టిబలిజ జాతిపిత దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ముమ్మిడివరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి చిత్ర పటానికి కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీసీ సామాజికవర్గ అభ్యున్నతి, అభివృద్ధికి దొమ్మేటి వెంకటరెడ్డి అందించిన సేవలు మరువలేనివన్నారు. తొలుత కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే బుచ్చిబాబు, గుత్తుల సాయి కట్‌చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, రాష్ట్ర మాలకార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాస్, దంగేటి శ్రీనివాస్, గంజా సుధాకర్, కట్టా సత్తిబాబు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, యాళ్లఉదయ్, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కారుక్మిణి, కుడుపూడి మల్లేశ్వరి, మెండి కమల, పెదపూడి రుక్మిణిలతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, శెట్టిబలిజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమలాపురంలో జయంతి వేడుకలు

అమలాపురంటౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి 172వ జయంతి వేడుకలను అమలాపురం హైస్కూలు సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సెంటర్‌లోని వెంకటరెడ్డి కాంస్య విగ్రహానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సంఘ పెద్దలు సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వెంకటరెడ్డి సాధించిన విజయాలను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వివరించారు. అనంతరం సంఘీయుల సమక్షంలో వెంకటరెడ్డి జయంతి వేడుకల కేక్‌ను కట్‌చేశారు. నాయకులు దొమ్మేటి గోపాలకృష్ణ, మట్టపర్తి నాగేంద్ర, మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి, కుడుపూడి త్రినాథరావు, విత్తనాల శేఖర్, యిళ్ల శేషారావు, గుత్తుల చిరంజీవి, వాసర్ల వెంకన్న, దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, దొమ్మేటి సాయిబాబు, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, వాసంశెట్టి సత్తిరాజు, కుడుపూడి భరత్‌భూషణ్, కడలి లాల్, కేతా భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డికి నివాళి

పి.గన్నవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో శెట్టిబలిజ నాయకుల ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంఘ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించి కేక్‌కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర నాయకులు సంసాని పెద్దిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చొల్లంగి సత్యనారాయణమూర్తి, మట్టపర్తి రామకృష్ణ, దొమ్మేటి శివరామన్, వాసంశెట్టి కుమార్, గుత్తుల చంటి, యంఢ్ర శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకటేశ్వరావు, గుత్తుల రామకృష్ణ, పితాని రాంబాబు, కాండ్రేగుల నరసింహమూర్తి, గుడాల సంపదరావు, దొమ్మేటి దుర్గారావు, పితాని ఏడుకొండలు, మట్టపర్తి మణికంఠ, ముషిని వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, వేండ్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


గడియారస్తంభం సెంటర్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యువజన సమైక్య ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఏఐవైఎఫ్ కమిటీ సభ్యులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలను పట్టుకుని ఊరేగారు. సీపీఐ జిల్లా కన్వీనర్ కొప్పుల సత్తిబాబు, నిమ్మకాయల శ్రీనివాసరావు, రెడ్డి సతీష్‌కుమార్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గూడాల రమణ, మోకా శ్రీను, కార్మిక సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. వీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కొంకాపల్లి ఎస్సీ వసతిగృహంలో అమరవీరుల చిత్రపటాలకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పి.దుర్గాప్రసాద్, జి.నాని, ఎం.రామకృష్ణ, బి.సన్నీ, ఎం.తేజ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం సర్దార్ భగత్‌సింగ్ సెంటర్‌లో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు యెనుముల కృష్ణపద్మరాజు, మోకా వెంకటసుబ్బారావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కీర్తిని వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో గారపాటి చంద్రశేఖర్, మామిడిపల్లి త్రిమూర్తులు, పోలినాటి సురేష్, గారపాటి శ్రీనివాస్, కట్టా బుజ్జి, తిరుపూరి సతీష్, సత్తిరెడ్డి సతీష్, అరుణ్‌కుమార్, బద్రి శ్రీకాంత్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

వెంకన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

అంబాజీపేట, మార్చి23(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట కొర్లపాటివారిపాలెం వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరరావు వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావు కోరారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మే7న స్వామివారి దివ్యకల్యాణం, 8న స్వామివారి ఆలయం వద్ద తీర్థం నిర్వహిస్తామన్నారు. అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు, మేడిద చిన్న, నైనాల ప్రభాకరరావు, కుప్పాల సీతారామ్, పరసా సత్తిబాబు, వీరా సతీష్, నల్లా మౌళి, రవణం విజయ్, అరిగెల బుజ్జి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను తిప్పి కొడదాం'

మలికిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కుట్రలను తిప్పి కొడదామని రాజోలు నియోజకవర్గ మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ నాయకులు అన్నారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో రాజోలు నియోజకవర్గ మాలల న్యాయ పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై సుదీర్ఘ చర్చ జరపకుండా బిల్లును ఆమోదించడం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇవ్వడమన్నారు. సమావేశంలో తోటే రాజేష్, తాడి సహదేవ్, బత్తుల మురళీకృష్ణ, గెడ్డం తులసీబాస్కర్, నల్లి శివ, దేవ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వారాహి కందదీపం నిమజ్జనం

అమలాపురం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 143రోజుల పాటు అఖండంగా వెలిగిన వారాహి కంద దీపాన్ని ఆదివారం దక్షిణ కాశీగా పేరొందిన కుండలేశ్వర మహా పుణ్యక్షేత్రంలోని వృద్ధ గౌతమీ నదిలో నిమజ్జనం చేశారు. శ్రీగౌతమి మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో 2024 అక్టోబరు 31న 22కిలోల అతి పెద్ద కందతో వారాహీ కంద దీపాన్ని వెలిగించారు. అప్పటి నుంచి పాడవకుండా 143రోజుల పాటు వెలిగిన కంద దీపాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో నిమజ్జనం చేశారు. మానవ శరీరంలోని దివ్యమైన కుండలినీ శక్తిని మేల్కొలిపే మార్మికమైన కుండలేశ్వర క్షేత్రంలో నిమజ్జనం చేయడం విశేషమని అక్షయపాత్ర ప్రతినిధులు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచాంగం ఆవిష్కరణ



పి.గన్నవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చాకలిపాలెం శ్రీకృష్ణబాలాజీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి) ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర పూర్ణ శాస్త్రీయ సనాతన 2025-26 పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీపూకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం హాజరై ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు పాలకవర్గంతో కలిసి పంచాగాన్ని ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు, ప్రధాన కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, వధూ, వరుల పరిచయవేదిక చైర్మన్ గ్రంధి గణేష్‌గుప్త, నాళం కిట్టు, శింగంశెట్టి కుమార్, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, వారణాసి గుప్త, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాలమహానాడు దీక్షలు

కాట్రేనికోన, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై ప్రభుత్వ ఏకపక్ష ధోరణిని నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో రిలే దీక్షలు ఆదివారం మూడో రోజుకు చేరాయి. కందికుప్ప పంచాయతీ బొజ్జావారిపేట వద్ద చేపట్టిన దీక్షలో గెల్లా రాజేంద్ర, అయితాబత్తుల శ్రీనుబాబు, వజ్రపు శరత్, బొజ్జా అప్పారావు(నాని), వరసాల చిన్నారావు, ఇసుకపట్ల రాంబాబు, నందిక శ్రీనివాసరావు, బూల పృథ్వి, జనిపల్లి రమణారెడ్డి, దాసరి ధరస్వామిప్రసాద్, కూరాటి సురేష్, పి.విజయ్ పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుచేస్తే సహించం


ముక్కు మూసుకుని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

యానాం, మార్చి23(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ (పవర్ గ్రిడ్) వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుచేస్తే సహించేది లేదని గ్రామస్తులు హెచ్చరించారు. చెత్త డంపింగ్‌ను వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన ఆందోళన ఆదివారం రెండో రోజుకు చేరింది. చెత్త డంపింగ్ చేయడానికి పూర్తిగా వ్యతిరేకం కాదని, ప్రజలకు ఇబ్బందులు లేని చోట డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈఅంశంపై స్థానిక ప్రజాప్రతినిదులు స్పందించి చెత్తను గోపాల్ నగర్‌లో వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈసందర్భంగా యానాం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో గోపాల్‌నగర్ సమీప గ్రామస్తులు ముక్కు మూసుకుని నిరసన చేపట్టారు.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

మలికిపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కేశవదుర్గాప్రసాద్ తెలిపారు. దిండి రిసార్ట్స్‌లో వ్యాపారులకు ఆహారభద్రతపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వ్యాపారస్తులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆహార కల్తీ జరిగితే ఉపేక్షించేది లేదని, ప్రతీ వ్యాపారస్తుడు శిక్షణ పొందాలన్నారు. ఫుడ్‌సేఫ్టీ ట్రైనర్ కె.ప్రవీణ్‌కుమార్, ఆనంద్‌కుమార్, కృష్ణారావు, వ్యాపారస్తులుపాల్గొన్నారు.

నూకాలమ్మ ఆదాయం రూ.91వేలు

మలికిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గూడపల్లి నూకాలమ్మవారి హుండీ ఆదాయం రూ.91,297 వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి గంధం సత్యనారాయణ తెలిపారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆదివారం హుండీ కానుకలు లెక్కింపు చేపట్టినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయాల తనిఖీదారు రామలింగేశ్వరరావు, సర్పంచ్ సుందర తాతాజీ, పెచ్చెట్టి నరసింహస్వామి, గుబ్బల శేషారత్నం, సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం చినకొల్లేరులో శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకుని ఆలయ పరిసరాలు, కొబ్బరి తోటల్లో విందు భోజనాలు చేశారు. అమ్మవారి ఆలయానికి వచ్చే రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అనుబంధ ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీసత్తెమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు గంటల కొలదీ భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. నెల రోజుల నుంచి దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. శ్రీపెద్దింట్లమ్మవారిని గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీరు, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఏసీ తెలిపారు.

ఘనంగా వీరభద్రుడి సంబరం

మామిడికుదురు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలో వీరభద్రస్వామి సంబరాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ వైనతేయ నది వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన పినిశెట్టి విజయ్ కుటుంబ సభ్యులు జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు చేసిన వీరనృత్యం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలో సీతారాముల కల్యాణంలో జరుగుతుందన్నారు. అమలాపురం డిపో నుంచి 5వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా భద్రాచలంలో స్వామివారి కల్యాణం పూర్తయిన తరువాత అమలాపురం వచ్చే భక్తుల కోసం అదేరోజు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రతీ అరగంటకు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్ అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు సెల్ 9959225576ను సంప్రదించాలన్నారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని 28వ రోజు రిలే దీక్ష

అమలాపురం రూరల్, మార్చి23(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన బీఎస్ నారాయణను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్‌యూనిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 28వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కేఎస్ఎం రావు, పీఎస్ కుమార్, పీఆర్ కుమారి, బి.సూర్యావతి, బి.లక్ష్మి, జి.శ్రీదేవి పాల్గొన్నారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. డ్రైవర్లపై వేదింపులు మానుకోవాలని యూనియన్ జిల్లాఉపకార్యదర్శి కె.రంగప్రసాద్ ఆధ్వర్యంలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 34వ రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. మీటింగ్‌లో జిల్లా కార్యదర్శి వి.గణపతి పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనారాయణకు ఐకాన్ ఆఫ్ ఆసియా అవార్డు



అమలాపురం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన డాక్టర్ వక్కపట్ల వీరవెంకటసత్యనారాయణ ప్రపంచ ప్రఖ్యాత యూనివర్శిటీ ఆక్స్‌ఫర్డ్ నుంచి ఐకాన్ ఆఫ్ ఆసియా ఫిన్ టెక్ ఇన్నోవేటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు. యునైటెడ్ కింగ్ డంలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో జరిగిన వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. బ్యాంకింగ్, విద్యా రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మెషీన్‌లెర్నింగ్ విభాగంలో ఈ అవార్డు అందుకున్నారు.

ఆధ్యాత్మిక శోభతో నగర సంకీర్తన

అంతర్వేది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది, వాడపల్లి పుణ్య క్షేత్రాల్లో హరినామ నగర సంకీర్తన కార్యక్రమాలు చేపడుతున్నట్టు గాడిమొగకు చెందిన శ్రీరాధాకృష్ణ మందిర భక్త బృందం తెలిపింది. ముందుగా స్వామివారిని దర్శించుకున్న భక్త బృందం ఆలయ ముఖ ద్వారం నుంచి బయలుదేరి ఆలయ పురవీధుల్లో హరినామ సంకీర్తన యుగధర్మం, భక్తిపాటలు ఆలపిస్తూ ఆదివారం నగర సంకీర్తన చేశారు. డోలు సన్నాయి మేళాలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా నగర సంకీర్తన సాగింది. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, శ్రీరాధాకృష్ణ మందిర భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణపై అవగాహన

ముమ్మిడివరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గడపగడపకు అంబేడ్కరిజాన్ని తీసుకువెళ్లడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక పేర్కొంది. ముమ్మిడివరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్‌హాలులో పెనుమాల సుధీర్ అధ్యక్షతన ఆదివారం గడపగడపకు అంబేడ్కరిజం-భారత రాజ్యాంగంపై అవగాహన అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వ్యక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌరుల ప్రాథమిక హక్కులను ఏవిధంగా నిర్వీర్యం చేస్తున్నాయో ప్రజలకు వివరించి వారికి అవగాహన కల్పించాలన్నారు. తద్వారా రాజ్యాంగ విశిష్టతను తెలియచేసి గ్రామాల్లో అంబేడ్కరిజం పటిష్టతకు సమష్టిగా పనిచేసేందుకు యువతను సంసిద్ధం చేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణపై ప్రజలకు ఏవిధంగా అవగాహన కల్పించాలి, అంబేడ్కరిజాన్ని ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలనే అంశాలపై వక్తలు మాట్లాడారు. సమావేశంలో కాశి జగ్జీవన్‌రామ్, ఎం.ఆశీర్వాదం, వడ్డి నాగేశ్వరరావు, నేరేడుమిల్లి అబ్బులు, పి.డేనియల్, కుంచే చినబాబు, గిడ్ల రమేష్, దేవరపల్లి ఏడుకొండలు, జనిపల్లి సత్యనారాయణ, దాసరి సత్యనారాయణ, పాము ఆనందరావు, యు.సాల్మన్‌రాజు, వై.చిట్టిబాబు, అప్పారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డును ఆధునికీకరించాలని ఎమ్మెల్యేకు వినతి

ముమ్మిడివరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డును ఆధునికీకరించాలని అయినాపురం గ్రామస్తులు ఆదివారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మొర పెట్టుకున్నారు. ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డు దశాబ్ద కాలంగా ఆధునికీకరణ లేకపోవడంతో అధ్వానంగా మారిందని, అయినాపురం గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు స్పందించి 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోడ్డు మంజూరైందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రోడ్డు ఆధునికీకరణ జరగలేదన్నారు. అయితే రోడ్డు ఆధునికీకరణకు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

అన్నప్రసాద ట్రస్టుకు దాతల విరాళాలు

అయినవిల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కొంపెల్ల అలివేలు కుటుంబ సభ్యులు శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 అందజేశారు. అలాగే తాటిపాక గ్రామానికి చెందిన లక్కింశెట్టి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.50వేలు అందజేశారు. ఆలయ అర్చకులు విరాళ దాతలకు వేదాశీర్వచనంచేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చంద్రబాబు నిర్ణయంపై బేడ, బుడగ జంగాల హర్షం

ఉప్పలగుప్తం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చెయ్యడంపై ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బేడ, బుడగ జంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గొల్లవిల్లిలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మందా కృష్ణమాదిగ, ఎన్డీయే నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పేర్ల మరిడియ్య, ముగ్గ పెద్దిరాజు, ఉప్పుకోట సత్యం, పేర్ల మహేష్, కళ్యాణం దుర్గరాజు, ముగ్గ నాగేశ్వరరావు, ముగ్గ శ్రీనివాస్, చెన్నూరు రమణ, ముగ్గ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి మృత్యువాత

అంబాజీపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కూలీ పనికి వెళ్లిన యువకుడు ఇనుప గొట్టం తలపై పడటంతో మృతి చెందాడు. చిరతపూడి గ్రామానికి చెందిన దారపురెడ్డి శ్రీనివాసు(పండు)(25) భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో జీవిస్తున్నాడు. అమలాపురంలో ఓ భవనం వద్ద ఆదివారం ఉదయం కాంక్రీట్ పనికి వెళ్లాడు. అక్కడ పని చేస్తోన్న సమయంలో ఒక ఇనుప గొట్టం శ్రీనివాస్ తలపై పడింది. దీంతో అతడు కుప్పకూలిపోయాడు. స్థానికులు, తోటి కూలీలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతిచెందాడు. శ్రీనివాస్ ది ప్రేమ వివాహం. అతడికి భార్య దుర్గా, కుమార్తె లహరి, కుమారుడు విశ్వాస్ ఉన్నారు. శ్రీనివాస్ జనసేన పార్టీలో చురుగ్గా పనిచేసేవాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందర్నీ కలిచివేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

రూ.5లక్షల బీమా మంజూరు


కాట్రేనికోన, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనకు చెందిన టీడీపీ కార్యకర్త చెల్లూరి వెంకరమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల బీమా మంజూరైంది. భార్య బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ అయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, సత్తాల ప్రసాద్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్వా గ్రామ సభలు

కాట్రేనికోన, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటికే రెండు సార్లు 14గ్రామాల్లో గ్రామస్థాయి కమిటీల ద్వారా ఆక్వా జోన్ రీసర్వే జరిగిందని ఎఫ్డీవో ఒక ప్రకటనలో తెలిపారు. అయితే గతంలో ప్రచురించిన గెజిట్లలో నమోదు కాని చెరువులు, వరి సాగుకు అనువుగా లేని చెరువులను ఇటీవల రీసర్వే చేసి పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించామన్నారు. ఈ నెల 25న చెయ్యేరు, ఉప్పూడి, కాట్రేనికోన, చిర్రయానాం, 26న బ్రహ్మసముద్రం, పల్లంకుర్రు, కందికుప్ప, దొంతికుర్రు, 27న లక్ష్మీవాడ, పెనుమెల్ల, గెద్దనపల్లి గ్రామాల్లో ఆక్వా గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అమలాపురంటౌన్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన సభ్యత్వ కార్డులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుఆదివారం క్యాంపు కార్యాలయంలో మండల, పట్టణశాఖ అధ్యక్షులు మల్లుల పోలయ్య, అరిగెల నానాజీ, దెందుకూరి సత్తిబాబురాజు, తిక్కిరెడ్డి నేతాజీలకు అందజేశారు.



మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం. పూజల్లో పాల్గొన్న భక్త జనం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.35 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.5,35,665 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కేశవస్వామి ఆలయంలో మైన్స్ జేడీ పూజలు



మైన్స్ జేడీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం మైన్స్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణ మూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం వారికి అందించారు.



రాయవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

రాయవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఆదివారం రాయవరంలో ఎమార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తొలుతగా గ్రామంలో బైక్ ర్యాలీ జరిపారు. ఈసందర్భంగా అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు వారు నివాళులర్పించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల చిత్రపటాలను ప్రదర్శించి వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయరాజ్ మాట్లాడారు. తొలుత ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంఈఎస్ సభ్యుడు కటకం అబ్బులు, ఎమ్మార్పీఎస్ నాయకులు లంక చందు, మందపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



కలవపువ్వు సెంటరులో ఆందోళన చేస్తున్న ప్రజలతో చర్చలు జరుపుతున్న పట్టణ సీఐ సురేష్

'మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకోం'

మండపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ 28, 29, 30 వార్డు ప్రజలు ఆందోళన జరుపుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం కూడా మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మహిళలు, వివిధ వర్గాల నాయకులు ర్యాలీగా రాజారత్న రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా నడుచుకుంటూ కలవపువ్వు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ వారు మానవ హారం, రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వారి ఆందోళన నేపథ్యంలో పట్టణ సీఐ దారం సురేష్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వానికి ఇక్కడి సమస్యను తెలుపుతామని చెప్పడంతో వారు శాంతించి ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు, సీఐటీయు నాయకురాలు కె.కృష్ణవేణి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బండి గోవిందు, ఎం.శ్రీనివాస్, ఆయా వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లపరుగు పోటీల్లో గుమ్మిలేరుకు ప్రథమ, తృతీయ స్థానాలు



బహుమతి అందుకుంటున్న వీరభద్రరావు

ఆలమూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్లపరుగు పోటీల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన ఎడ్లు ప్రథమ, తృతీయ స్థానాలు సాధించాయి. రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు ఎక్కడ జరిగినా గుమ్మిలేరుకు చెందిన కోరా వీరభద్రరావు ఎడ్లు ప్రథమస్థానంలో నిలుస్తుండటం విశేషం. ఆదివారం జరిగిన పోటీల్లో కూడా ప్రథమ, తృతీయస్థానాలు సాధించాయి. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బహుమతులు అందించారు. మరోసారి సత్తా చాటిన ఆయన్ను పలువురు అభినందించారు

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజనతో నష్టం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన

మండపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గాల పునర్ విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌లో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రనష్టం కలుగుతుందని ఇక్కడ ఎంపీ స్థానాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న సీట్లను కొనసాగించాలని మరో 20 ఏళ్ల వరకు డీలిమిటేషన్ జోలికి వెళ్లవద్దని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రంపై కాంగ్రెస్‌పార్టీ పోరాడుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కేవీ సుబ్బారావు, పిల్లి అప్పన్న, ఎం.శ్రీనివాస్, ఆలమండ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు బూరయ్య మృతికి సంతాపం

రావులపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రావులపాలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గున్నపు సూర్యనారాయణ(బూరయ్య) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జక్కంపూడి వెంకటస్వామి, గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, నందం వీరవెంకట సత్యనారాయణ, కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



బూరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ ఏదీ?

• మేట్లకే బాధ్యత • అరకొర వేతనం పొందుతున్న కూలీలు

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక పూటగడవటమే కష్టంగా ఉండేది. గ్రామాలు విడిచి పనుల కోసం వలస బాటన పట్టేవారు. వాటిని నివారించడంతో పాటు గ్రామాల్లో వారికి పనులు కల్పించాలనే లక్ష్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆయా పంచాయతీల వద్ద గ్రామ సభలను నిర్వహించి పనులు గుర్తించి తద్వారా ఆ ప్రాంత ప్రజలకు పనులు కల్పిస్తున్నారు. పనులు చేసే సమయంలో క్షేత్ర సహాయకులు పర్యవేక్షణ చేసి వేతనదారులకు పూర్తి వేతనం అందేలా పనులు దగ్గరుండి చేపట్టాలి. అయితే వారి పర్యవేక్షణ లేకుండానే పనులు చేపట్టడంతో వేతనదారులకు పూర్తి వేతనం రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 8,690 జాబ్‌కార్డులు ఉండగా 13,856 వేతనదారులు ఉన్నారు. 2024-25కు సంబంధించి 456 పనులను గ్రామసభల ద్వారా గుర్తించారు. కేవలం 4,863 జాబ్‌కార్డులకు మాత్రమే పనులు కల్పించారు. క్షేత్ర సహాయకులు వారికి కావాల్సిన వారికి పనులు చేపట్టడం, మరికొంత మందికి మస్తర్లు వేయడం అక్కడక్కడ చేతివాటం ప్రదర్శిస్తున్న సందర్భాలున్నాయి. క్షేత్ర సహాయకులు గుర్తించిన పనులకు సంబంధించి కొలతలు నిర్ణయించి పనులు చేపట్టాల్సి ఉంది. కనీసం పని ప్రాంగణంలో లేకపోవడంతో మేట్లు ఇష్టానుసారం కొలతలు వేసి పనులు చేపట్టడంతో రూ.300 రావాల్సిన వేతనం రూ.250 కూడా రాకపోవడంతో వేతనదారులు నష్టపోతున్నారు. ఇదేమిటని ఎవ్వరైనా ప్రశ్నిస్తే మీరు కొలతల ప్రకారం పనిచేయలేదని సమాధానం ఇస్తున్నారు. ముఖ్యంగా కొన్ని గ్రామాల్లో క్షేత్ర సహాయకులు లేకపోవడంతో పక్క గ్రామాల వారిని ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని వేతనదారులు పనులు లేక ఎవరిని అడగాలో తెలియక పూటగడవటం కష్టంగా మారిందని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలున్నాయి. కూలీలు కొలతలు సరిగ్గా ఇవ్వకపోవడంతో వేతనం రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వేసవిలో 2.30 లక్షల పనిదినాలను వేతనదారులకు కల్పించాలని తీర్మానాలు చేయగా 2.27 పనులు కల్పించారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను రికార్డుల్లో చూపిస్తున్నారే తప్ప వేతనదారులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దాలని వారు కోరుతున్నారు.



ఆత్రేయపురం మండలంలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు(ఫైల్)

దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం



కపిలేశ్వరపురం మండలం నల్లూరులో వెంకటరెడ్డి జయంతి వేడుకల దృశ్యం

మండపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని పట్టణ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిపారు. పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరిగిన సభలో సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటరెడ్డి చిత్రపటానికి సంఘీయులు నివాళులర్పించారు. అర్తమూరులో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు చప్పిడి నాగు నేతృత్వంలో జయంతిని జరిపారు. ఈ సందర్భంగా పలువురు వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో బండారు మునిరాజు సారధ్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు కె.రామారావు, చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం అని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. ఆదివారం కుందూరు గ్రామంలో వెంకటరెడ్డి జయంతిని జరిపారు. కార్యక్రమంలో పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ఆదివారం నల్లూరులో జరిపారు. గ్రామానికి చెందిన సీతారామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో జరిపిన జయంతి వేడుకల్లో సంఘ పెద్దలు పిల్లి గోవిందరాజు, మేడిశెట్టి వెంకట్రావు తదితరులతో పాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్వీట్స్, పులిహోర, మజ్జిగ అందించారు. తొలుత వెంకటరెడ్డి చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు ప్రాంగణంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని జరిపారు. దీనికి ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కముజు వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

పన్నులు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు

మండపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నుల వసూళ్లలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఆదివారం రెవెన్యూ సిబ్బందితో ఆస్తిపన్నులు వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చినెలాఖరుకు ఆస్తిపన్నులు వసూలు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఆర్వో శాస్త్రి, డీఈఈ శ్రీనివాస్, ఏఈలు, పవన్‌కుమార్, ఆంజనేయులు, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌ను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రామారావు తదితరులు

ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కుంచే

మండపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా మండపేటకు చెందిన కుంచే రమేష్ నియమితులయ్యారు. ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.డి. రామారావు నేతృత్వంలో కాకినాడలో జరిగిన కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యవర్గంలో మండపేటకు చెందిన కుంచే రమేష్‌కు సంఘ కోశాధికారిగా నియమించారని ఆదివారం తెలిపారు.



ర్యాలీలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం వద్ద అనూష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం పారిశ్రామికవేత్త చిన్నం చంద్రారెడ్డి దీన్ని ప్రారంభించారు. లావణ్యకుమార్ సౌజన్యంతో తొలిరోజు పుచ్చకాయ జ్యూస్, మజ్జిగతో నిర్వహించారు.

బాధితుడికి ఆర్థికసాయం

రావులపాలెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం రాజవరానికి చెందిన టి.శరత్‌కుమార్ రోడ్డు ప్రమాదానికి గురై కాళ్లు విరిగిపోయాయి. దీంతో కుటుంబ సభ్యులు రూ.5లక్షల వరకు ఖర్చు చేశారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో అక్షయ సేవా సంస్థను సాయం కోరగా బాధితుడికి రూ.11,500 సంస్థ సభ్యులు అందించారు.

వాడపల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాలపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆదివారం ఆలయ ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు దేవదాయ శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆయా పనులను పర్యవేక్షించారు. కోట్లాది రూపాయలతో చేపడుతున్న పుష్కరిణి, అన్నదాన భవనం, క్యూలైన్ల విస్తరణ, మరుగుదొడ్ల నిర్మాణం, పార్కింగ్ సౌకర్యాలు తదితర పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు యేపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారుల బృందం

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవగా ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం వాడపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మండపేట భారతి వృద్ధాశ్రమం, పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మార్రెమ్మ మాన్యంలో నిర్మాణం చేస్తున్న నూతన రోడ్లను ఆయన పరిశీలించారు. ఏనుగుల మహల్ రామాలయం నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చిన రూ.5,93,214 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే బండారు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



వాడపాలెంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భగత్‌సింగ్‌కు నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రజా సంఘాల నాయకులు భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళుర్పించారు. పాతబస్టాండు వద్ద నిర్వహించిన వర్ధంతిలో ఏఐటీయూసీ నాయకులు పి.రాము, సీఐటీయు నాయకులు ఎస్.బలరాం, ప్రజా నాట్యమండలి నాయకులు ప్రేమా నందం, ఆటో యూనియన్ నాయకులు పి.బాపిరాజు, యు.బాలు, జి.రాంబాబు, ఉప్పాడ రాంబాబు, బి.కాశి, ఎన్.సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఆలమూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారి చేతిలో చిన్న వయసులోనే ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లవవీరులు సాహిద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆలమూరు సమత కార్యాలయం నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో స్వాంతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు వి.శామ్యూల్ విప్లవ గేయాలతో సదస్సును ఆరంభించారు. భగత్ సింగ్ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రామకృష్ణ, జి.ఆనంద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్, రవికుమార్, విజయ్, కుమార్, శ్యామ్, నూకన్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పరీక్షలు విజయవంతం

ఆలమూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో ఉల్లాస్ వయోజన విద్య అసెస్‌మెంట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు వెలుగు ఏపీయం ఎం.ధనరాజు తెలిపారు. 792 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 788 మంది పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

ఆత్రేయపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన కేపర్తి భవాని తూర్పుగోదావరి జిల్లా తీపర్రుకు చెందిన సత్యనారాయణతో 2018లో వివాహం జరిగింది. వీరికి ఒక పాప జన్మించింది. భర్త పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. పెళ్లి సమయంలో రూ.2లక్షల కట్నంతో రూ.50వేలు ఆడపడుచు కట్నం కింద ముట్టజెప్పారు. కొన్నేళ్లపాటు వారి కాపురం సక్రమంగా సాగింది. కొంత కాలం నుంచి మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మరోవైపు భర్త, అత్తమామలు, ఆడపడుచులు తరచూ వేధింపులకు పాల్పడటంతో విసుగు చెంది భవాని పుట్టింటికి చేరుకుంది. ఆ తర్వాత వారి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఎన్ఆర్ఐ డాక్టర్ సుబ్బారావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిక్కిన

సుబ్బారావు సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ఐ డాక్టర్ బలుసు సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి తదితరులు అన్నారు. ఆదివారం అంగర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన సుబ్బారావుకు జరిగిన సన్మాన సభలో వారు మాట్లాడారు. అంగర పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తున్న సుబ్బారావు పేరును పీహెచ్‌సీకి పెట్టే విధంగా ప్రముఖులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బిక్కిన కోరారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు పలు కార్యక్రమాలకు ట్రస్ట్ ద్వారా కోట్లాది రూపాయలు అందించడం అభినందనీయమన్నారు. ఇందుకు కృతజ్ఞతగా సుబ్బారావును అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఘనంగా సన్మానించారు. తొలుత ఆయన్ను అంగర పెట్రోల్ బంక్ వద్ద నుంచి కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా మధ్య ఊరేగింపుగా సభాస్థలానికి తీసుకువచ్చారు. అంగర పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన దివంగత బలుసు వసుంధర విగ్రహాన్ని డాక్టర్ సుబ్బారావు, ఆయన కుటుంబ సభ్యులు పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పడమరఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ సమావేశం పట్టణ అధ్యక్షుడు దునే శ్రీనివాస్ అధ్యక్షతన రామచంద్రపురంలో జరిగింది. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సూచనలు, పార్టీ ముఖ్య కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో రామచంద్రపురం అసెంబ్లీ ఇన్‌చార్జి కోనా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు వల్లభనేని రవీంద్ర, కోకన్వీనర్ సలాది శేఖర్, కేశవ రాఘవేంద్ర, కె.హరిబాబు సలాది సతీష్ నాయుడు, ఖండవిల్లి సత్యనారాయణ, వడ్డాది నాగార్జున, కొనపాల గణేష్, మాధవభట్ల కృష్ణమూర్తి, కొప్పిశెట్టి శ్రీను, పులిగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గన్నమనేని నియామకంపై హర్షం



కపిలేశ్వరపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : భారత పరిశ్రమల శాఖ(సీఐఐ) ఏపీ ఛైర్మన్‌గా గన్నమనేని శేషమురళీకృష్ణ నియామకం పట్ల కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ తదితరులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మురళీకృష్ణ ప్రస్తుతం ఫ్లామెంట్ గ్రిడ్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవోగా ఉన్నారు. గతంలో కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి ఆక్సిజన్ ప్లాంట్ సమకూర్చినట్లు సర్పంచ్ తెలిపారు. గన్నమనేని నియామకం పట్ల ఆదివారం సర్పంచ్‌తో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉడుగులమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఆలమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నర్సిపూడి గ్రామ దేవత ఉడుగులమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి మంగళ స్నానాలు, 108 కలశాలతో అభిషేకం, శాంతి హోమం నిర్వహించారు. చల్లఘటం ఎత్తి జాతర మహోత్సవాన్ని ప్రారంభించారు. నాలుగు రోజుల అమ్మవారికి గరగ గ్రామోత్సవం నిర్వహించనున్నారు. శుక్రవారం అమ్మవారి జాతర, శనివారం తీర్థ మహోత్సవం, 30న శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ దర్శనంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.